


# గురువేధవాః

## చాగంటి శంకర్

**ముం**దుగా మా పెద్దనాన్న తాలూకా వాడు పెద్దవాడయ్యేడు. వెంటనే మా పెద్దనాన్నా పెద్దవాడయ్యేడు! మా పెద్దనాన్న నాకు 'పెద్ద'నాన్న ఎలా అయ్యేడో సరిగ్గా నాకిప్పటికీ తెలీదు.

మా వంశవృక్షం చివర్లలో ఊసూసులాడుతూ, ఎండిపోయున్న కొమ్మముక్కలాటివాడు మా పెద్దనాన్న! అలా అయినా, యిప్పుడు మాత్రం నాకాయన "దేవుడు నాన్న!!" 'గాడ్ ఫాదర్.'

విడ్వర్టయిజ్‌మెంటు వచ్చిందగ్గర్నుంచి మా నాన్న నన్నింట్లో నిలవనియ్యలేదు. పెద్దనాన్నని నాకుగా నేను కలవాలని ఒకటే పోరు! ప్రయాణమంటే ఓ పట్నాన కదలాలనుండదు నాకు. పెద్దనాన్న కోసం కట్టక తప్పింది కాదు! పెద్దనాన్న ఆఫీసూ, ఆఫీసులో ఆయన స్పెషలు రూమూ కనుక్కున్నాను. ఆయన రూము ముందు ఆయన పేరు అందంగా పెయింటు చెయ్యబడి ఉంది. ఆ రూము ముందు ఓ స్టూలూ, ఆ స్టూలు మీద ఓ కాసేలా వాడూను!! పేర్రాసి చీటీ యిచ్చి పంపేను వాణ్ణి. రెండో నిముషంలో బయటికొచ్చి నన్నాహ్వానిస్తున్నట్లు గదిలోకి చెయ్యి చూపుతూ నిల్చున్నాడు వాడు. నే లోపలికెళ్లేసరికి పెద్దనాన్న స్ప్రింగుచైర్‌లో గుండ్రంగా తిరుగుతూ కూర్చుని ఉన్నాడు, హెయిర్ కటింగ్ సెలూన్ కుర్చీని జ్ఞాపకి తెస్తూ! "ఏరా—" అన్నాడు పెద్దనాన్న నన్ను చూసి నేను నవ్వేను. "కూర్చో—" కుర్చీ చూపించేడు పొడుగ్గా టేబిలు, ఆ టేబిలుకి సరిపడా గ్లాసుషీటు, ఆ గ్లాసు కింద ఏవో కాగితాలూ ఉన్నాయి. నాలుగు రకాల రంగుల్లో నాలుగు ప్రియదర్శిని ఫోనులు యవ్వనంలో ఉన్న అమ్మాయిల్లా మెరిసిపోతూ, డయల్లోంచి కళ్ళు కొడుతున్నాయి! పెద్దనాన్నని నే చూసి చాలా ఏళ్లే అయింది ఆయనలో ఆ ఏళ్లంత మార్పూ వచ్చింది. ఇదివరకు లేంది, యిప్పుడాయన దేశనాయకుడి యూనిఫారమ్‌లో ఉన్నాడు! ఆ బట్టల్లోంచి ఖరీదూ, దర్పమూ కాంతి కిరణాల్లా ప్రతిబింబిస్తూ నా కళ్లల్లోకి కొడుతున్నాయి! అప్పుడు పీక్కుపోయి ఉండే మొహం యిప్పుడు గంభీరంగా కనిపిస్తోంది. అప్పుడు డొక్కుపోయి ఉంటే ఆయన బుగ్గలు యిప్పుడు గిల్లితే రక్తం చిందుతాయా అన్నట్టు, ఎర్రగా ఉబ్బి ఉన్నాయి. ఆ కళ్లలో కళ, మాటలో బరువు కనిపిస్తున్నాయి.

"ఏమిటేం సంగతులు? నాన్నెలా ఉన్నాడు? అమ్మ బావుందా?" అన్నాడు పెద్దనాన్న.

"బాగానే ఉన్నారు. నాన్నే మిమ్మల్ని కలవమని పంపేరు. ఉద్యోగానికి ఎప్లై చేసేను—" అని ఆపేను నేను.

"ఏందులో ?"

"అదే మొన్న యిరవయ్యో తారీఖు విడ్వర్టయిజ్‌మెంటు, మీ దాంట్లోనే" అన్నా.

"ఓహ్, అదా—" అని ఫిల్టరు సిగరెట్టు ముట్టించేడు పెద్దనాన్న. పెద్ద సిగరెట్టుని పెద్దనాన్న కాల్చడం చూడ్డం నా కిదే మొదటిసారి! బీడీలనుకుంటాను, యిదివరకాయన కాల్చేవాడు! కుర్చీలోంచి ముందుకు వంగి బజ్జరు నొక్కేడాయన, ఆ వంగడంలో ఆయనకి లేని ఖరీదుని నాకు చూపెట్టాలని ప్రయత్నిస్తూ! "టంగ్, టంగ్; టంగ్, టంగ్" అని తియ్యగా చిలకలా పలికింది బజ్జరు. బోయ్‌కి రెండుకాఫీలు ఆర్డరిచ్చేడు.

# కుర్ర వెధవా!

కుర్చీలోకి వాలి, ''చూడు,మనబంధువులు, మన జాతివాళ్లు, మన మతంవాళ్లు అని ఇలా అభిమానాలు పెంచుకొని అన్యాయం చేస్తే దేశం ఏమైపోతుంది? కష్టపడి కృషిచేసి వృద్ధిలోకి రావాలి. నీ కోసమని చెప్పి ఓ పేదవాణ్ని, ఓ తెలివైన వాణ్ని కాదని మోసం చెయ్యడం ధర్మం కాదు. బుద్ధిగా చదువు. తప్పక సెలక్టవుతావు—'' అన్నాడు సిగరెట్టు ముక్కని ఏష్ట్రేలో నలుపుతూ. ఆరుతూన్న సిగరెట్టులోంచి దట్టమైన పొగతోపాటు, అసహ్యమైన వాసనా వచ్చింది. తను చెందిన పార్టీ లక్ష్యాల్ని పెద్దనాన్న సరిగ్గా ఆకళింపు చేసుకున్నాడు. నిజమే, ఆ పార్టీకి జాతి మత భేదాలు లేవు. మానవ జాతి సౌభాతృత్వమే దాని ధ్యేయం! నాకు మాత్రం ఆ మాటలు జీర్ణం కాలేదు. ఆయనమీద ఎక్కడలేనంత కోపమూ వచ్చింది. అది నా మౌనంలో, ముఖ గాంభీర్యంలో ఆయనకి వ్యక్తమూ అయింది. ఆయన్ని చాలా చాలా అందామనుకున్నా, ఏమీ అనలేకపోయేను.

''నీ సాయం లేకుండానే జాబు సంపాదిస్తా. ఇంతకీ, నీకు బాగా తెలుసు, జాబు లేక పోయినా నాకేం ఫరవాలేదు! భూమీ, పుట్రా బోలెడున్నాయి —'' అని మాత్రం అన్నాను. బోయ్ ట్రేతో కాఫీలు పట్టుకొచ్చేడు.

''ఊరంత ఊసువాసంరా నీకు, కాఫీ త్రాగు —'' అని అన్నాడు, మందహాసంతో మాటల్ని జోడిస్తూ.

''నో థేంక్స్. మళ్లీ కలుస్తా —'' అని బయటికి జోరుగా వచ్చేసేను. సినిమాలు చూద్దామనుకున్నా. పెద్దనాన్న ఇంట్లో ఉందామనుకున్నా. సిటీ తిరుగుదామనుకున్నా. ఏదీ చెయ్యక, టైమింగ్ వెంటనే కనుక్కొని ట్రైనెక్కేసేను. నేను సింహాచలం వచ్చేసరికి రాత్రి పదకొండు దాటింది. నాన్న మడత కుర్చీలో కూర్చుని చుట్ట కాలుస్తున్నారు. ''ఏరా, అప్పుడే వచ్చేసేవు? వెళ్లిన పనైందా?'' నన్ను చూడగానే అడిగేరు నాన్న.

''ఆఁ అయింది! దేశభక్తి పాఠాలు వినొచ్చేను. నువ్వు చెయ్యకపోయినా ఉద్యోగం నేను సంపాదించగలనని ఛాలెంజ్ చేసి మరీ వచ్చేను. పరీక్ష బాగా రాస్తే ఆయన చేసే దేమిటి బోడి!!'' అన్నా.

''కుర్రవెధవా — లౌక్యం తెలీదురా నీకు, అసలేమన్నాడు?''

''ఏమన్నాడు? జాతి మత వర్ణ భేదాలు తప్పన్నాడు. అన్యాయానికీ, బంధుప్రీతికీ ఆయన గదిలో జాగా లేదన్నాడు —''


''దానికి నీకు ఒళ్లు మండిపోయి నోటి కొచ్చింది మాట్లాడి వచ్చేసేవు, అంతేనా?''

''అవును. నాకే కాదు, ఆ టైములో నీకైనా ఒళ్లు మండుతుంది —''

''ఎప్పుడొచ్చేవురా, పెరుగూ, అన్నం తిందువుగాని రా —'' అంటూ అమ్మ వచ్చి మా సంభాషణని ఆపింది.

ఆ ఉద్యోగానికి వెళ్లమన్నది నాన్నే అయినా, మొదట్లో దానిమీద నాకంత మోజు లేక పోయినా ఇప్పుడు మాత్రం నాలో పట్టుదల పెరిగిపోయింది. ఎలాగైనా దాన్ని సంపాదించాలి. చేసినా, చెయ్యకపోయినా దాన్ని తెమ్పుకున్నానని మాత్రం అనిపించుకోవాలి! అందుకే, ఆవేళనుంచి ఇల్లు దాటక చదువు ప్రారంభించేను. పాత పేపర్లు, పుస్తకాలు అన్నీ కొని కృషి చేసేను. పరీక్ష రాసేను. రాసిన నెలా పదిహేనురోజులకి ఇంటర్వ్యూ వచ్చింది. నాన్నవైపు గర్వంగా చూస్తూ ఇంటర్వ్యూకి వెళ్లేను. ఇంటర్వ్యూలో పెద్దనాన్న కూడా కూర్చుని ఉన్నాడు. ఆయన్నో పరాయివాడిలా చూస్తూ నాకు తోచింది నేను చెప్పేను. ఆయన మాత్రం నన్నే ప్రశ్నా వెయ్యలేదు. ఏ మొహం పెట్టుకు వేస్తాడు?? బయటికి నే నడుస్తూంటే బోయ్ ఓ చీటీ తెచ్చిచ్చేడు. దాంట్లో తనని కలవమని, ఎక్కడ కలవడమో ఎడ్రసు రాసి ఉంది. ఆలోచించేను. రాకపోతే పోనీ, నేను కలవను! లౌక్యం కాదు కావలసింది, మెరిట్; మెరిట్కావాలి! కలవలేదు కూడా! ఈ విషయాన్ని నాన్నకి చెప్పలేదు కూడా! మరో రెండు నెలల్లో ద్రోణాచలానికి పోస్టింగు వచ్చింది. నా పంతం నేరవేరింది. సింహాచలం నుంచి ద్రోణాచలానికి వెళ్లడమని నాకు బాధేసింది. రాయలసీమకి పోవాలి! దూరమన్న బాధని, న కృషితో ఉద్యోగం సంపాదించేనన్న ఆనందం తరిమికొట్టేసింది. అమ్మకి మాత్రం బెంగపట్టుకుంది. ''వీడేదో అన్నాడని కక్ష కొద్దీ దూరాభారానికి వేసేడు మీ అన్నగారు'' అని నాన్నని దెప్పింది అమ్మ. నన్ను వెళ్లొద్దనీ చెప్పింది. నాన్న మాత్రం 'ఉద్యోగం పురుష లక్షణం' అన్నారు. ''ఇటు పక్క ఖాళీల్లేవేమో! కక్ష కొద్దీ వాడలా చెయ్యడు!'' అని అమ్మకి సర్దిచెప్పేరు. ద్రోణాచలానికి వెళ్తూ అన్నాను ''దీనికి నువ్వే మంటావు నాన్నా??'' అని గొప్పగా. ''కుర్ర వెధవా — అదృష్టం నీ పక్కనుంది--బుద్ధిగా ఉద్యోగం చేసుకో —'' అన్నారు నాన్న.

ద్రోణాచలంలో నాతోపాటూ మరో ఇద్దరు అదే రోజున జాయనయ్యేరు. ముగ్గురమూ మాటా, మాటా మాట్లాడుకొని ఒకే రూము తీసుకున్నాము. ఏ అచలం మీదైనా అద్దె మాత్రం ఎక్కువే! చిన్నరూము — నూట యిరవై రూపాయలు! ద్రోణాచలంలోని కొండ, ఆ కొండమీద ఓ కోవెల, ఓ చర్చి, ఓ మశీదు బాగున్నాయి. సింహాచలంలోని మా కొండని గుర్తుకు తెస్తూ ఉంటుంది



ఈ కొండ! రెండు రైల్వే దారులు. ఒకటి కర్నూలుది. రెండోది గుంటూరుది. ఓవర్ బ్రిడ్జిలేక ఎప్పుడూ 'గేటు' పడిపోతూ ట్రాఫిక్కుని ఆపేస్తూ ఉంటుంది ఊళ్లోని రైల్వే క్రాసింగు! నా కొలీగ్సులో ఒకతను సర్కారువాడు, మరొకతను తెలంగాణా వాడూను! వాళ్లిద్దరూ పెద్దనాన్నని తిట్టని తిట్టులేదు! చెరొక అయిదువేలూ పోసి సంపాదించేరుట ఉద్యోగం! ఒకే గదిలో ఉండడం వల్ల ఆ మాట వాళ్ల నోటంట అనుకోకుండా ఓ రాత్రి వచ్చేసింది. నేను మాత్రం వాళ్లకి చెప్పలేదు — ఆయన నా "పెద్ద"నాన్నని!! వాళ్లముందు నాకెంతో గర్వంగా ఉండేది! రోజూ దాన్ని వాళ్లమీద చూపిస్తూనే ఉన్నాను నేను. డబ్బూ ఇవ్వలేదు, రికమెండేషనూ లేదు! అయినా ఉద్యోగం కృషితో సంపాదించేన్నేను! పెద్దనాన్న దేశభక్తికి ఉదాహరణగా నేనే మిగిలేను మరి! నా తెలివితేటలమీద నమ్మకముండే అలా మాట్లాడేడు పెద్దనాన్న!

నిజం చెప్పొద్దూ, ఒక్కరోజూ నాకు ఇక్కడ ఊసుపోవడం లేదు. భాష తెలుగే అయినా అందులో తేడా. ఇక తిండికూడా అంతే. మొదటి నెల జీతం తీసుకునే లోపలే నాకు "రక్త బేదులు" పట్టుకున్నాయి. డొక్క నింపుకుందుకు "లెక్కలు" సంపాదించాలి, కాదనను! కాని కష్టాలనిలా "ఎత్తుకు" రావలసొస్తుందని నే నిదివరకెప్పుడూ అనుకోలేదు. "ఆఫీసు కెళ్తుండావా అన్నా?" అని ఆప్యాయంగా పలకరించే వారున్నా, నా మనసెప్పుడూ యింటిమీదే ఉండేది. నాన్నకోరోజు ఆవేశంగా ఉత్తరం రాసేను — "పొలాలు గట్రా మనకున్నాయి కదా, వాటిల్ని చూసుకుంటూ నేనింటి పట్టునే పడుంటా, ఉద్యోగం వదిలి వచ్చేసేదా?" అని. నాన్నకి భయమేసిందల్లే ఉంది, వెంటనే రిప్లై వచ్చింది. కాని దాన్ని చదవేక నాకు ఒళ్లు మండిపోయింది. పెద్దనాన్న దగ్గరకెళ్లి ట్రాన్సఫరుకోసం అడగాలట!! "చూడు కుర్రవెధవా—పంతాలూ, పట్టింపులూ కావు, పనులు కావాలి. లౌక్యం తెలియాలి. బుద్ధిగా వెళ్లి అడుగు. తప్పకచేస్తాడు. నీ కంత మొహమాటమైతే, నీలకంఠయ్యని హెడ్ క్లార్క్ ఉంటాడు. ఆఫీసుకెళ్ళి అతన్ని కలువు" — అని రాసేరు నాన్న. ఆవేళ ఆఫీసులో ఈ విషయమై ఆలోచిస్తూ కూర్చున్నా. ఆఫీసులో మరో వార్త కూడా గుప్పుమంది. పెద్దనాన్న కుర్చీ కదిలిపోతోందనీ, ఇంకెవరో దాన్ని ఆక్రమించుకోబోతున్నారనీ చెపుతూ, ఆయన నిష్క్రమణ విషయమై అందరూ ఆనందించేరు! ఎలాగూ పోతున్నాడు కాబట్టి పోతూ, పోతూ నాకీ పని చేసిపోతే నాకు ఉపయోగంగా ఉంటుంది. అందుకే ఆయన కోసం మళ్లీ ప్రయాణం కట్టడానికి నిశ్చయించుకొని బయల్దేరాను.

ముందుగా నీలకంఠయ్యగారి కోసం వెళ్లేను. ఆయన్ని కనుక్కొని నమస్కారం చేస్తూ, "నేను, సోమశేఖరరావుగారి అబ్బాయిని; మాది సింహాచలం —" అన్నా.

"జానా? అబ్ ద్రోణాచలమ్‌మే??" అన్నాడాయన.

## ముందడుగు ...

వలికిలబడితే —
చేయి నిచ్చేవాడు లేవట్లే,
సాహసిస్తే —
ఆపేవాడూ లేడు.
మిత్రమా! ముందు కదుగిడు.
మంచు విచ్చుకుంటుంది.
జన మధ్యంలో
బండ్లు దూసుకుపోలేవా!
ముందరి జనమున్నారని నిలిపివేస్తే
బండి ప్రయాణం సాగుతుందా?
ముందడుగు వేస్తే —
ఆటంక కంటకాలు
అవే తప్పుకుంటాయి.

— కాణిపాకం లింగన్న

"అవును, మీకెలా తెలుసు?"

"నాకు గురుతు లేకపోడమేంటి? మీ బాపు నన్ను కలిసిండుగా? మీ పెదనాన్న గారిప్పుడు లేరుగా —"

"ఏం? ఎక్కడికి వేసేరు?"

"ఏడకీ ఎయ్యలేదు. ఊపర్ బదల్ గయాతో సబ్‌కుచ్ బదల్ హో జాతా — (పైన మార్పు వస్తే, అంతా మారిపోతుంది)" అని ఫేను వైపుకి చేతులు పెడుతూ అన్నాడాయన.

"బయటకి వస్తారా, మీతో మాట్లాడాలి?" అన్నా.

"చలో—" అని నాతోపాటు నడిచేడాయన.

"చా తాగుదాం" అని కఫేలోకి తీసుకెళ్లేడు. టీ తాగుతూ, "ట్రాన్స్‌ఫర్ హో క్యా? (ట్రాన్స్‌ఫర్ కావాలా?)" అనడిగేడు. నేను టీ నములుతూ నవ్వేను.

"ఏడకి?"

"ఏముంది, మా వైజాగ్‌కి —"

"వైజాగ్ హై తో జరా ముష్కిల్ హై భాయీ. (వైజాగయితే కొంచె కష్టం బాబూ—) నయా బాసొచ్చిండు. పరేషానీ చేస్తుండు. రస్తాలోకి గిప్పుడు వస్తున్నడు. రాజమండ్రి అయితె అవుద్ది—"

"పోనీ రాజమండ్రీ అయినా ఫరవాలేదు చేసిపెట్టండి—"

"'దో' అవుద్ది."

నాకు అర్థమయింది.

"'దో' వే??"

"ఏం గట్లగంటున్నారు? పోష్టింగయిన ఏక్ మహీనాలోనె ట్రాన్స్‌ఫరంటె ముష్కిల్ గంద? మీ బాపు కంతా గురుతె. గప్పుడు పాంచ్ యిచ్చిండు గంద??"

"పాంచ్? మా ఫాదరా??"

"అలా పరేషానవుతావేటి? మీ బాపు చెప్పిండు గదా? కిరికిరీ లేకుండ ఖుద్ నేనే చేయించినా. మీ పెదనాన్న భాయీని కూడా ఇడిచిపెట్టిండు గాదు ... గదే నీతిలే భాయీ — కుర్సీలో బైటాయించినంత వరకే పైసా ... గిప్పుడు, కౌన్ దేతా?? గప్పుడు మీ బాపు మీ సైడుకి వేయించమనే అడిగిండు ... ఖాళీల్లేవు ... గట్లా గయి పోయింది ... గిప్పుడు బాసు మారిండు ... ఇస్కా భీ దేనా హైనా??" అన్నాడాయన. ఆ భాష కొంత నాకు అర్థం కాకపోయినా, భావం మాత్రం తెలిసింది. మా నాన్న నాతో చెప్పలేదన్న విషయం ఇతడి దగ్గరెందు కనడమని కొంచెం ఆలోచించి మానేసేను. నా కంతా ఓ ప్రహసనంలా తోచింది. ఆశ్చర్యం నుంచి తేరుకునేటప్పటికి కొంచెం సేపు పట్టింది. "కుర్రవెధవా—" అని మా నాన్న నన్ను అనడం గుర్తొచ్చింది. మా పెద్దనాన్న ఆవేళ నాకు చెప్పిన "ఉవాచ"లు, ఆయన సిగరెట్టుని ఏష్‌ట్రేలో నలిపి ఆర్పేయడం జ్ఞాపకం వచ్చేయి.

"దేవ్ (ఒకటివ్వర)కి చేసిపెట్టు నీలకంఠం భాయీ—" అని అతన్ని ఆ సంఖ్యకి దింపడానికి ప్రయత్నించేను.

"కుర్రవెధవని కాను నాన్నా, రాజమండ్రీ వచ్చేస్తున్నా చూడు!!" అనుకున్నాను. ★